అభయం!

☛ శ్రీసత్యసాయి జిల్లా హిందూపురానికి చెందిన భాగ్యలక్ష్మి గర్భం దాల్చింది. అయితే ఆమెకు గుండెలో సమస్యలు కూడా ఉండటంతో హిందూపురం ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు కాన్పు సమయంలో కష్టమవుతుందని భావించి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు గత నెల 27న రెఫర్ చేశారు. ఆమెకు ఈ నెల 2వ తేదీన ఇక్కడి వైద్యులు సిజేరియన్ ద్వారా సుఖ ప్రసవం చేశారు. తల్లీబిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారు.

☛ కర్నూలు జిల్లా గోనెగండ్ల మండలం కులుమాల గ్రామానికి చెందిన ముంతాజ్‌కు లంగ్ ఎటాక్(ఊపిరితిత్తుల్లో ఆరోగ్య సమస్య) వచ్చింది. దీంతో పాటు బీపీ, ఆయాసం పెరగడంతో ప్రసవం కోసం ఎమ్మిగనూరు వైద్యులు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వారం రోజుల క్రితం పంపించారు. ఆమెకు ఐదు రోజుల క్రితం వైద్యులు సుఖ ప్రసవమయ్యేలా చేశారు. ఊపిరితిత్తుల్లో సమస్య ఉండటంతో ఐసీయూలో ఉంచి కోలుకునేలా చేశారు. ప్రస్తుతం ఆమె పూర్తిగా కోలుకుంది.

హైరిస్క్ గర్భిణులకు పెద్దాసుపత్రి రక్ష

- ఇతర ఆసుపత్రుల్లో సీరియస్ అయిన కేసులూ ఇక్కడికే...
- సుఖప్రసవమయ్యేలా వైద్యుల చర్యలు
- రోజూ 30 దాకా ప్రసవాలు
- అందులో అధిక శాతం హైరిస్క్ కేసులు



ప్రసూతి విభాగంలో చికిత్స పొందుతున్న బాలింతలు

కర్నూలు(హాస్పిటల్): తల్లీబిడ్డ ఆరోగ్య సంరక్షణే ధ్యేయంగా రాష్ట్ర ప్రభుత్వం పనిచేస్తోంది. దీంతో క్షేత్రస్థాయిలో వైద్య సిబ్బంది గర్భిణుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారు. హైరిస్క్ ఉన్న గర్భిణీలను ముందుగానే ప్రత్యేకంగా వైద్యపరీక్షలు నిర్వహించి పర్యవేక్షిస్తున్నారు. ప్రసవానికి రెండు వారాల ముందుగానే అన్ని రకాల వసతులు ఉన్న ప్రభుత్వాసుపత్రికి తరలించి సుఖప్రసవమయ్యేలా చేస్తున్నారు. మరోవైపు ప్రైవేటు ఆసుపత్రుల్లోనూ చేతులెత్తేసిన ప్రసవం కేసులు పెద్దాసుపత్రికి వస్తున్నాయి.

ఉమ్మడి కర్నూలు జిల్లాలో 87 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, 40 అర్బన్‌హెల్త్ సెంటర్లు, మూడు ఏరియా ఆసుపత్రులు, రెండు బోధనాసుపత్రులు ఉన్నాయి. వీటితో పాటు 200లకు పైగా ప్రైవేటు ఆసుపత్రులు ఏర్పాటయ్యాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో దాదాపుగా అన్నింటిలో, ప్రైవేటులో 90కి పైగా ఆసుపత్రుల్లో ప్రసవాలు చేస్తున్నారు. ఆయా ఆసుపత్రుల్లో ఎక్కడ గర్భిణికి హైరిస్క్ ఉందని తెలిసినా వెంటనే వారు కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు రెఫర్ చేస్తారు. కేవలం ఉమ్మడి జిల్లానే గాకుండా ఉమ్మడి అనంతపురం, వైఎస్ఆర్ జిల్లా, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల నుంచి సైతం హైరిస్క్ గర్భిణులను కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు తీసుకొచ్చి ప్రసవాలు చేయిస్తున్నారు. దీంతో ఆసుపత్రిలోని ప్రసూతి విభాగం నిత్యం గర్భిణులతో కిటకిటలాడుతుంటోంది.

ప్రసూతి విభాగంలో గత ఐదేళ్ల నుంచి ఓపీ,ప్రసవాల వివరాలు ఇలా..

సంవత్సరం	ఓపీ	ప్రసవాల సంఖ్య
2019	56,858	10,542
2020	25,586	8,372
2021	38,339	9,309
2022	29,661	9,890
2023	30,100	9,175

ఏటా 10వేల ప్రసవాలకు పైగానే...

కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో ప్రతి రోజూ 30 నుంచి 35 ప్రసవాలు జరుగుతున్నాయి. ఈ లెక్కన ప్రతి నెలా సగటున 800, ఏటా 10వేల వరకు ప్రసవాలు జరుగుతున్నాయి. రాష్ట్రంలోని ప్రభుత్వ ఆసుపత్రుల్లో అత్యధిక శాతం ఇక్కడే ప్రసవాలు జరుగుతున్నట్లు గణాంకాలు చెబుతున్నాయి. పెద్దాసుపత్రిలో ప్రత్యేకంగా మాతాశిశు సంక్షేమ భవనం ఉండటమే గాక ఇటీవల ప్రత్యేకంగా ఐసీయునూ ఏర్పాటు చేశారు. మెడికల్ సమస్యలుంటే వెంటనే ఏఎంసీలో ఉంచి వైద్యం అందిస్తుంటారు.

హైరిస్క్ ఉన్నా సేఫ్ డెలివరీ

ప్రసూతి విభాగానికి ప్రతిరోజూ వచ్చే ప్రసవాల్లో 5 నుంచి 7 వరకు హైరిస్క్ ప్రసవాలే ఉంటాయి. ఇవి ఆయా ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల నుంచి రెఫర్ చేయబడ్డవి. ఇతర జిల్లాల్లోని బోధనాసుపత్రుల నుంచి సైతం ఇక్కడికి రెఫరల్‌గా చికిత్స కోసం వస్తున్నాయంటే పరిస్థితి అర్థం చేసుకోవచ్చు. ఎక్కడ నుంచి వచ్చినా, ఏ ఆసుపత్రి వైద్యులు రెఫర్ చేసినా మాకు కూడా కష్టమే అన్న మాటే ఇక్కడ వినపడదు. హైరిస్క్‌లో ఎక్కువగా బీపీ, షుగర్, ఫిట్స్, తీవ్ర రక్తహీనత, పసిరికలు, సెప్సిస్, గుండె, కిడ్నీ జబ్బులు, థైరాయిడ్ సమస్యలున్న వాటిని హైరిస్క్ కేసులంటారు. హైరిస్క్ పేరుతో వచ్చిన గర్భిణులకు దాదాపుగా సేఫ్ డెలివరీ చేసి పంపించడమే ఇక్కడి వైద్య సిబ్బంది లక్ష్యంగా పనిచేస్తున్నారు. ఈ విషయంలో వారు సఫలీకృతమవుతున్నారు కూడా.

పూర్తిస్థాయిలో వైద్యుల సంఖ్య

ఆసుపత్రిలోని ప్రసూతి విభాగంలో ఏడు యూనిట్లు ఉన్నాయి. ఇందులో ప్రస్తుతం ఐదుగురు ప్రొఫెసర్లు, ఐదుగురు అసోసియేట్ ప్రొఫెసర్లు, 18 మంది అసిస్టెంట్ ప్రొఫెసర్లు, ఆరుగురు సీనియర్ రెసిడెంట్లు పనిచేస్తున్నారు. వీరితో పాటు మొత్తం 18 పీజీ సీట్లు ఉండటంతో ప్రస్తుతం 42 మంది పీజీలు చదువుతూ వైద్యం చేస్తున్నారు. ఇందులో ఇటీవల ఆరు పీజీ సీట్లు రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. వైద్యుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో హైరిస్క్ కేసులు వచ్చినా ఇబ్బంది లేకుండా ఉంటోంది.

అధిక శాతం హైరిస్క్ కేసులే వస్తున్నాయి



ఉమ్మడి జిల్లా నుంచే గాక ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి సైతం మా వద్దకు ప్రతిరోజూ 10 వరకు హైరిస్క్ కేసులు వస్తుంటాయి. ఇందులో అధికంగా తీవ్ర రక్తహీనత, బీపీ పెరగడం, తగ్గడం, ఇతర అనారోగ్య సమస్యలతో హైరిస్క్ ప్రెగ్నెన్సీతో వస్తున్నారు. వారికి అవసరమైన అన్ని రకాల వైద్యసేవలు అందేలా చేసి సుఖప్రసవమయ్యేలా చూస్తున్నాము. ఈ మేరకు మా విభాగం వైద్యులు, సిబ్బంది అహర్నిశలు శ్రమిస్తున్నారు. ఎంతో హైరిస్క్‌తో వచ్చిన గర్భిణి సుఖప్రసవం అయి కోలుకుని ఇంటికి వెళ్తుంటే మాకు కలిగే సంతృప్తి చెప్పలేనిదిగా ఉంటుంది.

–డాక్టర్ ఎ.శ్రీలక్ష్మి, గైనకాలజి హెచ్ఓడీ, జీజీహెచ్, కర్నూలు

క్లుప్తంగా

ఈరన్నస్వామి ఆలయంలో భక్తుల రద్దీ



విశేష అలంకరణలో స్వామివారు

కౌతాళం: మండలంలోని ఉరుకుంద గ్రామంలో వెలసిన ఈరన్న స్వామి దర్శనానికి సోమవారం వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దీంతో స్వామి క్షేత్రం భక్తులతో సందడి నెలకొంది. అర్చకులు స్వామి వారి మూలవిరాట్‌కు తెల్లవారుజామున సుప్రభాతసేవ, మహామంగళ హారతి, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు చేపట్టి ఫలపుష్పాలతో అలంకరించారు. మొక్కు చెల్లింపులో భాగంగా కొందరు భక్తులు క్షేత్ర ఆవరణలో పిండి వంటలు వండి స్వామివారికి నివేదించారు.

ఎస్టీ సాధనే వాల్మీకుల లక్ష్యం



వాల్‌పోస్టర్లను విడుదల చేస్తున్న వాల్మీకి ట్రస్ట్ ప్రతినిధులు

ఆదోనిరూరల్: వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చడమే తమ లక్ష్యమని దక్షిణ భారత శ్రీమహర్షి వాల్మీకి ట్రస్ట్ రంగనాయకులు అన్నారు. మండలంలోని పెద్దతుంబళం గ్రామంలో సోమవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వాల్మీకులకు ఎస్టీ హోదా వల్ల లభించే ప్రయోజనాల గురించి వివరించారు. అలాగే ఎస్టీ హోదా సాధన వాల్మీకుల ప్రథమ కర్తవ్యమని తెలిపారు. విద్య, ఉద్యోగం రాజకీయాల్లో ప్రధాన్యత ఉంటుందని చెప్పారు. ప్రభుత్వం నుంచే అనేక రాయితీలు, సౌకర్యాలు లభిస్తాయన్నారు.

ఆదోనిలో పోలీసు కవాతు



పట్టణంలో కవాతు చేస్తున్న కేంద్ర బలగాలు

ఆదోనిఅర్బన్: ఎస్పీ క్రిష్ణకాంత్ ఆదేశాల మేరకు సోమవారం ఆదోని డీఎస్పీ శివనారాయణస్వామి ఆధ్వర్యంలో కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. రానున్న ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఆదోనిలోని స్టేట్ బ్యాంకు, భీమా సర్కిల్, మీర్ మహ్మద్‌షా వలి దర్గా, జైన్ టెంపుల్ సర్కిల్, శ్రీనివాసభవన్, ఎల్‌బీ స్ట్రీట్, మదీనా మజీద్, చౌకీమఠం, ఆజంకాజా మసీద్, శుక్రవారంపేట, పెద్దశక్తిగుడి, బోయగేరి, సట్టాబజార్, ప్రభాకర్ టాకీస్ మీదుగా టూటౌన్ పోలీస్‌స్టేషన్ వరకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేలా పోలీసుశాఖ కృషి చేస్తుందని డీఎస్పీ తెలిపారు. వన్‌టౌన్, టూటౌన్, త్రీటౌన్ సీఐలు తేజమూర్తి, గోపీచంద్ పాల్గొన్నారు.

నేడు మంగమాంబ రథోత్సవం



కరిడిగుడ్డంలో కొలువైన మంగమాంబ

ఆలూరు రూరల్: మండలంలోని కరిడిగుడ్డం గ్రామంలో కొలువైన అవధూత మంగమాంబ, కమ్మరచేడు గ్రామంలోని మంగమ్మవ్వ రథోత్సవం మంగళవారం వైభవంగా నిర్వహించనున్నారు. ఇందు కోసం అన్ని ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 6 గంటలకు అమ్మవారికి ప్రత్యేక పూజల అనంతరం రథోత్సవం నిర్వహిస్తారు. రథోత్సవానికి తరలి వచ్చే భక్తులకు అన్ని సౌకర్యాలు కల్పించారు. కరిడిగుడ్డం, కమ్మరచేడు గ్రామాల్లో రథోత్సవాలకు ఎస్ఐ ఓబులేసు ఆధ్వర్యంలో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

ఆలూరు రూరల్: మండలంలోని మొగలవల్లి గ్రామ శివారులో పేకాట ఆడుతున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ ఓబులేసు సోమవారం తెలిపారు. నిందితుల నుంచి రూ.8,190 నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు వెల్లడించారు.

నిందితుడి అరెస్ట్

వెల్దుర్తి(కృష్ణగిరి): స్థానిక పోలీస్‌స్టేషన్ పరిధిలోని గుంటుపల్లె గ్రామంలో పాత కక్షల నేపథ్యంలో రైతు రవితేజకు చెందిన చీనీ, కొబ్బరి మొక్కలు, డ్రిప్‌ను అదే గ్రామానికి చెందిన దాయాది లక్ష్మీనారాయణ నిప్పుపెట్టి కాల్చివేసిన సంఘటన ఈనెల 4వ తేదీన చోటుచేసుకుంది. ఈ విషయంపై రవితేజ తమను ఆశ్రయించగా విచారణ జరిపి సోమవారం నిందితుడు లక్ష్మీనారాయణపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ చంద్రశేఖర్ రెడ్డి తెలిపారు. తాను ఇచ్చిన అప్పు తిరిగి చెల్లించాలని కోరడంతో జీర్ణించుకోలేని నిందితుడు ఈ ఘటనకు పాల్పడ్డాడని, అప్పు వసూలయ్యేలా, పండ్ల మొక్కలు, డ్రిప్ కాల్చివేతపై తగిన చర్యలు తీసుకోవాలంటూ రవితేజ ఫిర్యాదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

నేత్రపర్వంగా రథోత్సవం



భక్తుల మధ్య సాగుతున్న రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో గురుసుబ్బారూఢ స్వామి

కోసిగి: స్థానిక రంగప్ప గట్టు వద్ద వెలసిన గురు సుబ్బారూఢ స్వామి మహా రథోత్సవం సోమవారం సాయంత్రం భక్తుల జయజయ ధ్వానాల మధ్య నేత్ర పర్వంగా సాగింది. వేకువజామున నుంచి ఆలయ ధర్మకర్తలు చంద్రయ్య, బండారి దయా, మణికంఠ స్వామి ఆధ్వర్యంలో స్వామి వారికి అభిషేకాలు, ఆకు పూజ, రుద్రాభిషేకం, వెండికవచ అలంకరణ గావించి మహా మంగళ హారతులు ఇచ్చారు. భక్తులు స్వామి వారిని దర్శించుకుని పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. ఉదయం స్వామి వారి ఉత్సవమూర్తిని ప్రభపై ఆసీనులు గావించ స్వామి వారి పాదాల వరకు లాగి యథాస్థానంలోకి చేర్చారు. సాయంకాలం పల్లకీలో కొలువుంచి కలశాలు, డప్పు వాయిద్యాల నడుమ ఆలయం నుంచి పెండేకల్లు పొలాల్లోని ఆంజనేయ స్వామి దేవాలయం వరకు ఊరేగింపుగా వెళ్లి ఆలయం చేరుకున్నారు. అనంతరం మేళతాళాలు, పూర్ణకుంభంతో మహా రథం వద్దకు చేరు కుని పూజలు చేసి ఉత్సవ మూర్తిని రథంపై అధిష్టింపజేసి స్వామి వారి పాదాల చెంత వరకు లాగారు. ఎస్ఐ సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. భక్తులకు ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి భజనలు చేశారు.

ఉత్సాహంగా సాగుతున్న సెపక్‌తక్రా పోటీలు



తలపడుతున్న క్రీడాకారులు



గెలుపొందిన క్రీడాకారులతో వైస్ ప్రిన్సిపల్ సురేష్

ఆదోనిసెంట్రల్: పట్టణంలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో ఆల్ ఇండియా అంతర్ విశ్వవిద్యాలయాల సెపక్‌తక్రా పోటీలు పోటాపోటీగా జరుగుతున్నాయి. సోమవారం వైస్ ప్రిన్సిపల్ సురేష్ సమక్షంలో వివిధ విశ్వవిద్యాలయాలకు చెందిన క్రీడాకారులు తలపడ్డారు. రెండో రోజు ఏపీజే అబ్దుల్‌కలాం విశ్వవిద్యాలయంపై ఎంజీపీఆర్ బరేలి విశ్వవిద్యాలయం, శ్రీకుషల్‌దాస్ విశ్వవిద్యాలయంపై అన్నా విశ్వవిద్యాలయం చెన్నై, మాధవ్ యూనివర్సిటీ పింద్వారాపై ఉస్మానియా యూనివర్సిటీ హైదరాబాద్, గొండావాన్ యూనివర్సిటీపై రాయలసీమ విశ్వవిద్యాలయం కర్నూలు జట్లు విజయం సాధించాయి. ఈ పోటీలకు ముఖ్య అతిథిగా రాయలసీమ విశ్వవిద్యాలయం, గోండ్వానా విశ్వవిద్యాలయం వైస్ ప్రిన్సిపల్ సురేష్ హాజరయ్యారు. క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. క్రీడల్లో రాణిస్తే మంచి భవిష్యత్ ఉంటుందని సూచించారు. క్రీడల్లో రాణించి కళాశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

పట్టుబడిన మద్యం ధ్వంసం



మాట్లాడుతున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్



కర్ణాటక మద్యాన్ని ధ్వంసం చేస్తున్న సెబ్ వాహనం

ఆదోనిరూరల్: సెబ్ జిల్లా ఎస్పీ క్రిష్ణకాంత్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ సూపరింటెండెంట్ రవికుమార్ ఆదోని సెబ్‌స్టేషన్ పరిధిలోని వివిధ కేసుల్లో పట్టుబడిన సారా, కర్ణాటక మద్యాన్ని సెబ్ వాహనాలతో ధ్వంసం చేయించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ.. మొత్తం 70 కేసులకు సంబంధించి 1,200 లీటర్ల కర్ణాటక మద్యం, 160 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు వెల్లడించారు. వీటి విలువ రూ.8,83,500గా ఉంటుందన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో కర్ణాటక మద్యం సరఫరాను వంద శాతం అడ్డుకున్న జిల్లాగా కర్నూలు జిల్లా ప్రథమ స్థానంలో ఉందన్నారు. ఉన్నతాధికారుల నుంచి ప్రశంసలు లభిస్తున్నాయని తెలిపారు. అక్రమం మద్యం, సారా కట్టడికి పటిష్ట చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఎన్నికల నేపథ్యంలో తనిఖీలను ముమ్మరం చేశామన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారు ఎంతటివారైనా వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. సెబ్ సీఐ విస్నీలత, ఎస్ఐ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

మహానందిలో భక్తుల సందడి



కామేశ్వరీదేవిని దర్శించుకుంటున్న భక్తులు

మహానంది: మహానందిలో సోమవారం భక్తుల సందడి కనిపించింది. రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో ఆలయానికి తరలిరావడంతో ఆలయ ప్రాంగణాలు కళకళలాడుతున్నాయి. ఆలయానికి వచ్చిన భక్తులు కోనేరుల్లో పుణ్యస్నానాలు ఆచరించి శ్రీ కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని అభిషేకం, అర్చనలు చేశారు. ఆలయంలో ఉదయం నుంచి రద్దీ నెలకొంది. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ ఈఓ కాపు. చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ప్రత్యేక ఏర్పాట్లు చేపట్టారు. భక్తుల రద్దీకి అనుగుణంగా నిరంతర దర్శనం ఏర్పాటు చేశారు.

పార్టీ విజయానికి సైనికుల్లా పనిచేయాలి



ఆస్పరిలో సిద్ధం కిట్లను అందజేస్తున్న చంద్రశేఖర్

ఆస్పరి: రాబోయే ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయం కోసం నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలని యువనాయకుడు చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. సోమవారం మండలంలోని ఆస్పరి, జొహరాపురం, హలిగేర గ్రామాలలో 'మేము సిద్ధం – మా పోలింగ్ బూత్ సిద్ధం' కార్యక్రమం నిర్వహించారు. బూత్ కన్వీనర్లకు సిద్ధం కిట్లను అందజేశారు. ఆయన మాట్లాడుతూ.. సీఎం వైఎస్ జగనన్న అందించిన సంక్షేమ పథకాలు, అభివృద్ధిని ఇంటింటికీ వెళ్లి వివరించి ఓట్లను అభ్యర్థించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు దొరబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు మూలింటి రాఘవేంద్ర, కట్టెల గోవర్ధన, బసవరాజు, వెంకటేష్, గుడిసె మహానంది తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా పది పరీక్షలు

- ఆదోని డివిజనల్‌లో 499 మంది గైర్హాజరు
- తనిఖీ చేసి తర్వాతే లోనికి అనుమతి



ఆదోని మున్సిపల్ హైస్కూల్ ఆవరణలో వేచి ఉన్న విద్యార్థులు



ఆదోని: మున్సిపల్ హైస్కూల్‌లో విద్యార్థులను తనిఖీ చేసి పంపుతున్న పోలీసులు



జెడ్పీ ఉన్నత పాఠశాల నుంచి పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు



పెద్దతుంబళంలో పరీక్ష రాయడానికి సిద్ధంగా ఉన్న విద్యార్థులు

ఆదోనిసెంట్రల్: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. ఆదోని డివిజన్‌లో రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు 16,745 మంది పరీక్షలు రాయాల్సి ఉండగా 16,246 హాజరయ్యారు. 499 మంది గైర్హాజరయ్యారు. రెగ్యులర్ విద్యార్థులు 16,254 మంది ఉండగా 15,863 మంది, ప్రైవేట్ విద్యార్థులు 491 మందికి గాను 391 మంది పరీక్షలు రాశారు. ఆదోని నియోజకవర్గంలోని 17 సెంటర్‌లలో రెగ్యులర్ విద్యార్థులు 3502 మంది విద్యార్థులు పరీక్షలు రాయడానికి సిద్ధం కాగా 3454 విద్యార్థులు పరీక్షలు రాశారు. ఆయా కేంద్రాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రతి విద్యార్థిని క్షుణ్ణంగా పరిశీలించి పరీక్ష కేంద్రంలోకి పంపించారు. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఉదయాన్నే ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేయించి పరీక్ష కేంద్రానికి తీసుకొచ్చారు. విద్యార్థుల తల్లిదండ్రులు, స్నేహితులు శుభాకాంక్షలు తెలుపుతూ లోపలికి పంపించారు. పరీక్షా కేంద్రాల ఆవరణలో 144 సెక్షన్ విధించారు.

ఆదోనిరూరల్: మండలంలోని పెద్దతుంబళం, పెద్ద హరివాణం, దొడ్డనగేరి, సంతెకూడ్లురు, ఆరేకల్, మదిరె గ్రామాల్లో పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ప్రారంభమయ్యాయి. విద్యార్థులకు తాగునీరు, వైద్యం, తదితర సౌకర్యాలను అందుబాటులో ఉంచినట్లు అధికారులు తెలిపారు.

పదవ తరగతి పరీక్షలు ప్రారంభం

కౌతాళం: పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. విద్యార్థులు మొదటి రోజు తెలుగు, ఉర్దూ, కన్నడ పరీక్షలు రాశారు. మొత్తం ఐదు కేంద్రాల్లో 878 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 28 మంది గైర్హాజరైనట్లు ఎంఈఓ శోభరాణి తెలిపారు.

మొదటి రోజు ప్రశాంతం

పెద్దకడబూరు: స్థానిక జెడ్పీ ఉన్నత, ఆదర్శ, కస్తూర్బా పాఠశాలల్లో పదవ తరగతి పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వీటిల్లో ఆయా పాఠశాలలతో పాటు చిన్నతుంబళం, కల్లుకుంట, హెచ్.మురవణి, కంబలదిన్నె, ఆదోని మండలం దొడ్డనగేరి గ్రామ ఉన్నత పాఠశాల విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. మొదటి రోజు సోమవారం పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. ఉన్నత పాఠశాలలో 225 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కావాల్సి ఉండగా 15 గైర్హాజరయ్యారు. ఆదర్శ పాఠశాలలో 204మందికి 9 మంది గైర్హాజరు కాగా, కస్తూర్బాలో 83 మందికి నలుగురు గైర్హాజరయ్యారని పరీక్షల నిర్వాహకులు తెలిపారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

కృష్ణగిరి: మంచంపై నుంచి ప్రమాదవశాత్తు కింద పడిన వ్యక్తి చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందాడు. ఎస్ఐ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల మేరకు.. మండల పరిధిలోని చిట్యాల గ్రామానికి చెందిన కొనసపల్లె ఎల్లప్ప (56) ఈ నెల 15న సాయంత్రం ఇంటి వద్ద మంచంపై పడుకుని ప్రమాదవశాత్తు కింద పడ్డాడు. అక్కడున్న రాయికి మెడ భాగం బలంగా తగలడంతో వెన్నుపూస విరిగి నడవలేని స్థితిలో ఉన్న ఈయన్ను కుటుంబసభ్యులు వెంటనే కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఆయన కోలుకోలేక సోమవారం మృతి చెందినట్లు ఎస్ఐ తెలిపారు. మృతుడికి భార్య, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. కుమార్తె సునీత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఆయన తెలియజేశారు.

భారీగా కర్ణాటక మద్యం పట్టివేత



పట్టుబడ్డ కర్ణాటక మద్యంతో నందవరం పోలీసులు

నందవరం: అక్రమంగా తరలిస్తున్న కర్ణాటక మద్యాన్ని నందవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వివరాలివి.. సి.బెళగల్ మండలం తిమ్మందొడ్డి గ్రామానికి చెందిన బోయ వీరేష్, లక్ష్మన్న మోటారు సైకిళ్లపై సోమవారం మద్యాన్ని తీసుకొస్తూ నాగలదిన్నె బ్రిడ్జి వద్ద ఎమ్మిగనూరు రూరల్ సీఐ మోహన్‌రెడ్డి, నందవరం ఎస్ఐ తిమ్మయ్య చేపట్టిన తనిఖీల్లో పట్టుబడ్డారు. వీరు కర్ణాటకలోని తలమారి గ్రామానికి చెందిన వీరేష్ నుంచి మద్యం కొనుగోలు చేసి తీసుకొస్తున్నట్లు తెలిసింది. నిందితుల నుంచి 1920 (90 ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను అరెస్ట్ చేసి రెండు బైకులను సీజ్ చేశారు. అలాగే సాయంత్రం తుంగభద్ర నదీ తీరంలో దాడులు చేస్తుండగా కర్ణాటకలోని చిన్నమంచాల గ్రామానికి చెందిన లింగప్ప అనే వ్యక్తి నుంచి 1152 (90 ఎంఎల్) ఒరిజినల్ చాయిస్ మద్యం టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. ఎన్నికల నేపథ్యంలో దాడులు ముమ్మరం చేయడంతో కర్ణాటక మద్యం భారీగా పట్టుబడినట్లు సీఐ మోహన్ రెడ్డి పేర్కొన్నారు.

ప్రైవేటు అధ్యాపకులను వెంటనే రిలీవ్ చేయాలి

కర్నూలు సిటీ: ఇంటర్మీడియెట్ పరీక్షల మూల్యాంకనానికి అసిస్టెంట్ ఎగ్జామినర్లుగా ఆర్డరు పొందిన ప్రతి అధ్యాపకుడు విధులకు హాజరుకావాలని, ప్రైవేటు కాలేజీల్లో పని చేస్తున్న అధ్యాపకులను ఆయా కాలేజీలు వెంటనే రిలీవ్ చేయాలని ఇంటర్మీడియేట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి గురవయ్య శెట్టి సూచించారు. సోమవారం మూల్యాంకనం మొదటి స్పెల్ ప్రారంభమైంది. ఈ సందర్భంగా ముందుగా స్పాట్‌లో పాల్గొనే అధ్యాపకులతో జిల్లా పరీక్షల కమిటీ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించి మాట్లాడారు. మూల్యాంకనం ప్రతి రోజు ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతుందన్నారు. ప్రతి అసిస్టెంట్ ఎగ్జామినర్ నిర్దేశించిన సమయానికి వచ్చి, క్యాంపు సమయం వరకు ఉండాలన్నారు. ఎక్కడా చిన్న పొరపాటుకు తావు ఇవ్వకుండా పేపర్లను మూల్యాంకనం చేయాలన్నారు. ఓఎంఆర్ షీటును ఖచ్చితంగా పోస్ట్ చేసి బబుల్ చేయాలన్నారు. ఆర్డరు పొందిన ప్రతి ఒక్క అధ్యాపకుడు విధులకు హాజరుకావాలన్నారు. సమావేశంలో అసిస్టెంట్ క్యాంపు ఆఫీసర్–1 కె.జమీర్ పాషా, క్యాంపు ఆఫీసర్–2 సుంకన్న, సీసీఓ –1 జీ.ఎస్ సురేష్ చంద్ర, సీసీఓ–2 కె.నాగభూషణ్ రెడ్డి, పి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా - ముగ్గురికి తీవ్రగాయలు

తుగ్గలి: మండల పరిధిలోని రాతన సమీపంలో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. గుంతకల్లు మండలం ములకలపెంటకు చెందిన నలుగురు రైతులు పత్తికొండ వారపు సంతలో పొట్టేళ్లు కొనుగోలు చేసి తిరిగి వెళ్తుండగా మార్గంమధ్యలో రాతన ఆశ్రమ పాఠశాల వద్ద ఆటో అదుపుతప్పి బోల్తా పడింది. రంగనాయకులు, ఆంజనేయులు, హనుమప్ప తీవ్రంగా గాయపడగా చిన్న పెద్దన్నకు స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను పత్తికొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తీవ్రంగా గాయపడిన ముగ్గురిని మెరుగైన వైద్యం కోసం కర్నూలుకు తరలించారు. కేసు నమోదు చేసుకున్నట్లు తుగ్గలి పోలీసులు తెలిపారు.

నష్టపోయిన రైతుల జాబితా సిద్ధం చేయండి

చిప్పగిరి: రబీ సీజన్‌లో పంటలు సాగుచేసి నష్టపోయిన రైతుల జాబితా పక్కాగా రూపొందించాలని ఏడీఏ సునీత మండల వ్యవసాయ అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక వ్యవసాయ కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం ప్రకటించిన కరవు మండలాల జాబితాలో చిప్పగిరి ఉందని చెప్పారు. రబీ సీజన్‌లో పంటలు సాగు చేసి నష్టపోయిన ప్రతి రైతుకు పరిహారం అందేలా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఏఓ విజయలక్ష్మి, ఏఈఓ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.